సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం। 6। సెప్టెంబర్। 2023



యువతి అనుమానాస్పద మృతి

ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆమె వివాహం జరిగి ఆరు నెలలు కూడా తిరక్కుండానే అనంతలో కాలకు వెళ్లిపోయింది. దీంతో ఆమె కన్నవాళ్లు శోక సంద్రంలో మునిగిపోయారు. -8లో



జోరుగా ఈ- పంట నమోదు

ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలకు నాంది పలికింది. విత్తు నుంచి మొదలు విత్తనం వరకు అవసరమైన అన్ని రకాలుగా ఆసరాగా నిలుస్తోంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.200
రెండోరకం	రూ.90	రూ.148



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 261 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	460	566
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 136.500 కిలోలు

జ్ఞానజ్యోతి గురువు

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- జిల్లా కేంద్రంలో ఘనంగా గురుపూజోత్సవం
- 93 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానం

రాయచోటి: విజ్ఞానాభివృద్ధికి గురువు పునాదిలాంటి వారని... వారు సమాజానికి ఆదర్శమూర్తులని కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. తన ఉన్నతికి దోహద పడింది గురువులే అని పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని లయ గార్డెన్స్ హాలులో మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ గిరీషా పీఎస్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ... జిల్లా ఏర్పడిన తర్వాత రెండవసారి ఇంత పెద్ద ఎత్తున గురుపూజోత్సవం నిర్వహించిన విద్యాశాఖకు అభినందనలు తెలిపారు. గురువును పెద్దలు దేవుడితో పోల్చారన్నారు. తల్లిదండ్రుల తర్వాత ఆ స్థానం గురువుదేనన్నారు. గురువు ఒక మార్గదర్శనం. గురువు లేకుండా ఎవరూ లక్ష్యాన్ని సాధించలేరన్నారు. గురువులంటే పిల్లలకు బోధన చేసేవాళ్లే కాదు... సమాజానికి ఆదర్శకులని పేర్కొన్నారు. పిల్లలను ఒక మంచి సిటిజన్‌గా తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యాభివృద్ధిలో అన్నమయ్య జిల్లాను రాష్ట్రం దేశంలో ఒక ప్రత్యేక స్థానం పొందేలా కృషి చేయాలని ఆశిస్తున్నానన్నారు.



ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మిని సత్కరిస్తున్న కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



కుసుమకుమారికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

తల్లిదండ్రులు జన్మనిస్తే..
భవిష్యత్తు నిచ్చేది గురువులు:
ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

తల్లిదండ్రులు జన్మనిస్తే... భవిష్యత్తు నిచ్చేది గురువులని శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త , రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. నడక, నడత, నేర్పించి భవిష్యత్తులో ఎలా ఉండాలని తీర్చిదిద్దే వ్యక్తులు మన గురువులన్నారు. నేడు మన దేశం ఇంత పురోగతి సాధించడానికి, ఇంత వేగంగా అభివృద్ధి చెందడానికి గురువులు మూలకారకులని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతంలో చదివి మన రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ మహనీయుడు అయ్యారన్నారు. అదే రకంగా ప్రపంచానికి టెక్నాలజీలో అబ్బురపరిచిన మహనీయులు ఏపీజే అబ్దుల్ కలాం తన ప్రతి మాటల్లో వారి గురువుల గురించి తెలియజేసే వారన్నారు. భవిష్యత్తులో గురువులకు సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. విద్యారంగంలో ప్రభుత్వం గొప్ప మార్పులు చేసిందని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల ఉండేలా తీర్చిదిద్దిందన్నారు. డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం మాట్లాడుతూ గురువును సామాజిక శాస్త్రవేత్త అని కూడా అంటారని.. విద్యార్థులను మంచి పౌరులుగా తయారు చేసి దేశం గర్వించే స్థాయిలో నిలపాలని ఉపాధ్యాయులను కోరారు.



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం

జిల్లా వ్యాప్తంగా 93 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను కలెక్టరు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఘనంగా సత్కరించి, జ్ఞాపికా మరియు ప్రశంస పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, డిప్యూటీ ఈఓలు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు.. హాజరైన ఉపాధ్యాయులు

● ప్రధాని అభినందనలు



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ శెట్టెం ఆంజనేయులు

జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికైన రాయచోటి పట్టణంలోని మాసాపేట ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు శెట్టెం ఆంజనేయులును ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అభినందించారు. న్యూఢిల్లీలో మంగళవారం రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్న అనంతరం పురస్కారగ్రహీతలతో ప్రధాని సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంజనేయులును అభినందించారు. నూతన విద్యా వ్యవస్థ బలోపేతం చేయడానికి అందరూ కృషి చేయాలని ప్రధాని సూచించారు. -రాయచోటి

● మంత్రి శుభాకాంక్షలు



విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకుంటున్న పెద్దిరెడ్డి నీలవేణి

విశాఖపట్టణంలో మంగళవారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాన్ని అందుకున్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వీరికి పురస్కార ప్రదానం చేశారు.



మార్ల ఓబుల్‌రెడ్డి
సంబేపల్లె, జెడ్పీహెచ్ స్కూల్



హరిమధుసూదన్‌రావు,
దొమ్మర నంద్యాల జెడ్పీ హైస్కూల్



రాఘవేంద్రమ్మ, ఎస్‌జీటీ
గుణకనపల్లె ఎంపీపీ స్కూల్

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 11లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీ.పురుషోత్తం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులను బోధించేందుకు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగివుండి బోధనలో అనుభవం కలిగినవారికి పోస్టుల భర్తీలో ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

పీలేరురూరల్: స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల శాఖలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి అన్నారు. అభ్యర్థులు ఈ నెల 11లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

12 నుంచి వైవీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు

వైవీయూ: వైవీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఈ నెల 12 నుంచి ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఈశ్వరరెడ్డి తెలిపారు. 5వ సెమిస్టర్‌లోని అన్ని పేపర్లు, ఒకటి నుంచి నాలుగో సెమిస్టర్ వరకు ఒక్కో పేపర్ తప్పిన విద్యార్థులను పరీక్షలకు అనుమతించినట్లు తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్లు, కళాశాల జారీ చేసిన గుర్తింపు కార్డు తీసుకురావాల్సి ఉంటుందన్నారు.

పంపిణీకి సిద్ధంగా గడ్డి కత్తిరించే యంత్రాలు



యంత్రాలను సిద్ధం చేస్తున్న టెక్నీషియన్లు

రాయచోటిటౌన్ : పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు సబ్సిడీతో అందజేసే గడ్డి కత్తిరించే యంత్రాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని జిల్లా జేడీఏహెచ్ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులను ప్రోత్సహించే క్రమంలో వీటిని అందజేస్తోందని పేర్కొన్నారు. వీటి ఖరీదు రూ.33,970లు కాగా రైతు 60 శాతం రూ. 20,352లు చెల్లిస్తే చాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 612 యంత్రాలు కావాలని ప్రతిపాదనలు పెట్టామని చెప్పారు. మొదటి విడతలో 50 వచ్చాయని మరో రెండు రోజుల్లో 25 వస్తాయని చెప్పారు. మిగిలినవి కూడా త్వరలో వస్తాయని చెప్పారు. రైతులు కోరితే మరిన్ని యంత్రాలు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

అన్నమయ్య జిల్లా ఎస్పీగా కృష్ణారావు



రాయచోటి : అన్నమయ్య జిల్లా ఎస్పీగా బొడ్డేపల్లి కృష్ణారావును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. అలాగే ఇదివరకు ఇక్కడ ఎస్పీగా పనిచేస్తున్న గంగాధర్‌రావును అనంతపురం 14 బెటాలియన్ కమాండర్‌గా బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 12న అన్నమయ్య జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గంగాధరరావు ఐదు నెలల కాలంలో జిల్లాలో శాంతిభద్రతలను తనదైన శైలిలో పర్యవేక్షించారు. ప్రస్తుతం ఏసీబీ ఎస్పీగా పనిచేస్తున్న బొడ్డేపల్లి కృష్ణారావును అన్నమయ్య జిల్లా ఎస్పీగా నియమించారు.

▶▶ వైఎస్ఆర్ జిల్లా ఎస్పీగా సిద్దార్థ్ కౌశల్



కడప అర్బన్: వైఎస్ఆర్ జిల్లా నూతన ఎస్పీగా 2012 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సిద్దార్థ్ కౌశల్ నియమితులయ్యారు ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు ఆయన ప్రకాశం, కృష్ణా, కర్నూలు జిల్లాలో ఎస్పీగా పనిచేశారు. తరువాత ఆక్టోపస్‌కు బదిలీ అయ్యారు.

అన్బురాజన్ బదిలీ

జిల్లాలో ఎక్కువ కాలం (3 సంవత్సరాల 10 నెలల పాటు) సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన ఎస్పీ అన్బురాజన్‌ను అనంతపురం జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీగా విధులు చేపట్టినప్పటి నుంచి ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారంపై దృష్టి పెట్టారు. 'దిశ' మహిళా పోలీస్‌స్టేషన్ ద్వారా మహిళలు, చిన్నారుల నేరాలను అరికట్టారు.

చవితి ఉత్సవాలను విజయవంతం చేద్దాం

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి: అందరి సమన్వయంతో జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిద్దామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో వినాయక చవితి ఉత్సవాలపై అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్‌తో కలిసి శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. అలాగే ఈ ఉత్సవాలను అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం మార్గంతో పాటు, వెలిగల్లు ప్రాజెక్టు వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనానికి విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లు అడ్డు రాకుండా చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. క్రేన్ ఏర్పాటు, లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మూడు డివిజన్లలో కూడా శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆర్డీఓలకు సూచించారు. అలాగే విగ్రహాలను ఏర్పాటు చేసిన పందిర్లను సంబంధిత తహశీల్దార్లు, ఎస్‌హెచ్‌ఓలు తప్పనిసరిగా సందర్శించాలన్నారు. నిమజ్జనం సందర్భంగా 3వ రోజు, 5,9, 11వ రోజులలో విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసేటప్పుడు పాటించాల్సిన భద్రతా చర్యలు తదితర అంశాలపై అధికారులు, పోలీసులు, శాంతి కమిటీ సభ్యులతో జేసీ సుదీర్ఘంగా చర్చించారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి సూచనలు, సలహాలు ఇవ్వాలని శాంతి కమిటీ సభ్యులను జేసీ కోరారు. అనంతరం అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్ మాట్లాడుతూ ఎవరెవరు ఏ ప్రదేశంలో ఎన్ని అడుగుల వినాయక విగ్రహం, పందిర్ల స్థల విస్తీర్ణం ఏర్పాటు చెయ్యదలిచారో ఆ వివరాలను సమీప పోలీస్ స్టేషన్‌లో తెలియజేసి విగ్రహం ఏర్పాటుకు అనుమతి పొందాలన్నారు. ఉత్సవాలపై సోషల్ మీడియాలో వచ్చే అసంబద్ధమైన సమాచారాలను ప్రజలు నమ్మకుండా సమీప పోలీస్ స్టేషన్‌లో వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం సమావేశంలో శాంతి కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల బక్రీద్ పండుగ ఏ చిన్న లోటుపాటు లేకుండా బాగా జరిగిందని, అలాగే భక్తి శ్రద్ధలతో జరుపుకునే వినాయక చవితి పండుగను కూడా సంప్రదాయ బద్ధంగా, మతసామరస్యం వెల్లివిరిసేలా స్వీయక్రమ శిక్షణ పాటిస్తూ అందరి సహకారం, సమన్వయంతో విజయవంతం చేస్తామన్నారు. డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు రంగస్వామి, మురళీ, రామకృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, శాంతి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పక్కన ఏఎస్పీ

ప్రగతి దిశగా పరుగులు

- ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేద్దాం
- ప్రతి మండలానికి రూ.5 లక్షల నిధులిస్తాం
- జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్మన్ వెల్లడి

కడప సెవెన్ రోడ్స్: అన్ని రంగాల్లో ఇతర జిల్లాలకు ఆదర్శంగా ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కోరారు. కడప నగరంలోని జెడ్పీ కార్యాలయంలో మంగళవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముందుగా మాజీ రాష్ట్రపతి, దివంగత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను జెడ్పీ చైర్మన్ సత్కరించారు. అనంతరం అధికారులు ప్రగతిని వివరిస్తూనే సభ్యులు వివిధ అంశాలపై లేవనెత్తిన సమస్యలకు సమాధానమిచ్చారు. ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలకు డొమెస్టిక్ కింద విద్యుత్తు చార్జీలు వసూలు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ జేడీకి సూచించారు. మందపల్లెలో కుక్కల దాడిలో మృతి చెందిన 25 గొర్రెలకు పరిహారం ఇవ్వాలని పశుసంవర్ధక శాఖ జేడీకి సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో తాగు నీరు, మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతి మండలానికి రూ.5లక్షల జెడ్పీ నిధులు ఇస్తామని వెల్లడించారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏ ప్రాంతానికి ఏ యూనిట్ అవసరమో గుర్తించాలన్నారు. అనంతరం వేంపల్లెలో ఖాళీగా ఉన్న 30 సెంట్ల స్థలాన్ని బస్టాండు, డీసీ ఈబీలకు కేటాయించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, జెడ్పీ ఉపాధ్యక్షుడు బాలయ్య, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, ఉమ్మడి జిల్లాలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు.



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

సమస్యలపై సభ్యుల గళం

- రెండేళ్లుగా రైతులకు బీమా అందలేదని బి.కోడూరు జెడ్పీటీసీ సభ్యుడు దావీద్ తెలుపగా, బ్యాంకు ఖాతా, ఆధార్ క్రియాశీలకంగా లేక 1145 మందికి బీమా అందలేదని వ్యవసాయ శాఖ జేడీ సమాధానమిచ్చారు.
- రాయితీపై రైతులకు రాగులు, జొన్నలు, పెసర, మినుము విత్తనాలు ఇవ్వాలని కో–ఆప్షన్ సభ్యుడు కరీముల్లా, వీఎస్.పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి కోరారు.
- ఇసుక తవ్వకాలతో పాపాఘ్ని నీరందక రైతుల పంటలు ఎండుతున్నాయని, తవ్వకాలు రెండు నెలలపాటు ఆపాలని చక్రాయపేట జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాద్ రెడ్డి కోరారు.
- వ్యవసాయ బోరు ఫెయిల్ అయితే రిగ్గు ఓనర్‌కు ప్రభుత్వం డబ్బులిస్తోందని, కానీ రైతుకు వారు మరో బోరు వేయడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ప్రసాద్ ఆరోపించారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో పేర్లు నమోదు చేసుకుని.. కొందరు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారని, ఉపాధ్యాయులు, ఎంఈఓలు సొమ్ము కాజేస్తున్నారని బి.మఠం ఎంపీపీ వీరనారాయణ రెడ్డి అన్నారు.
- ఎస్ఆర్‌పురం హైస్కూల్‌కు ప్రహరీ నిర్మించాలని పెనగలూరు జెడ్పీటీసీ సుబ్బరాయుడు కోరారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని వేంపల్లె జెడ్పీటీసీ కోరారు.
- చక్రాయపేట, నాగుల గుట్టపల్లె ఆసుపత్రుల్లో రోగులకు మంచాలు లేవని, ఈసీజీ సౌకర్యం లేదని జడ్పీటీసీ తెలిపారు.
- బెల్ కంపెనీ ఏర్పాటుచేసిన డయాలసిస్ సెంటర్ భవనంలో ఇంకా సేవలు ప్రారంభం కాలేదని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ సభ దృష్టికి తీసుకొచ్చారు.
- పాయసంపల్లెలో స్టాఫ్ నర్సును నియమించాలని వీఎస్‌పల్లె ఎంపీపీ కోరారు.
- తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాల్లో అవినీతి ఎక్కువైందని బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి నిరసన తెలుపుతూ వాకౌట్ చేస్తాననడంతో జెడ్పీ చైర్మెన్ సముదాయించారు. విచారించి చర్యలు తీసుకుంటామని జేసీ గణేష్‌కుమార్ తెలిపారు.

హౌస్ బిల్డింగ్ సొసైటీ సమావేశం వాయిదా

కడప ఎడ్యుకేషన్: కడపలోని సీఎస్ఐ పాఠశాలలో ఈ నెల 6వతేదీన నిర్వహించనున్న హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథరెడ్డి, బాలశౌరిరెడ్డి తెలిపారు. తదుపరి సమావేశ తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత

మదనపల్లె సిటీ : బస్సులో మరిచిపోయిన సెల్‌ఫోన్‌ను ప్రయాణికుడికి అప్పగించిన సంఘటన మంగళవారం మదనపల్లె ఆర్టీసీ వన్‌డిపోలో జరిగింది. హైదరబాదు నుంచి వస్తున్న ప్రయాణికుడు బాషా రూ.15 వేలు విలువ చేసే ఎంఐ ఫోన్‌ను మరిచిపోయి కదిరిలో దిగి వెళ్లిపోయాడు. గమనించిన బస్సు డ్రైవర్లు మోహన్, ప్రసాద్‌లు డీఎం మూరే వెంకటరమణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రయాణికుడు బాషాకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికుడికి సెల్‌ఫోన్ అందించారు.

ఆదాయం పెంచాలి

హైదరాబాదు, బళ్లారి రూట్‌లో నడిచే బస్సుల్లో ఆదాయం పెంచాలని సిబ్బందికి డీఎం వెంకటరమణరెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మదనపల్లె : తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చొరబడి రూ.2.35 లక్షల విలువైన 150 గ్రాముల బంగారునగలను దోచుకెళ్లిన సంఘటన పట్టణంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి సమాచారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ శివారుప్రాంతమైన దేవతానగర్ ఎక్స్‌టెన్షన్ వివేకానందనగర్‌లో నివాసం ఉన్న ప్రభాకర్ భార్య గడియారపు శివమ్మ గత నెల 27న బెంగళూరులో ఉన్న కుమార్తె వద్దకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లింది. ఈనెల మూడో తేదీ సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చింది. అయితే అప్పటికే ఇంటితాళాలు పగలగొట్టి ఉండటం, ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించారు. ఇంట్లోని వస్తువులను పరిశీలించగా, దాదాపు లక్షల విలువైన 150 గ్రాముల బంగారు నగలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. దీంతో బాధితురాలు గడియారపు శివమ్మ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ వెంకటేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

జనారణ్యంలోకి మయూరం



తంబళ్లపల్లె : మల్లయ్యకొండ అటవీప్రాంతం నుంచి మంగళవారం ఉదయం జాతీయపక్షి అయిన నెమలి మండల కేంద్రంలోకి వచ్చింది. రోడ్డుపై సంచరిస్తుండగా జనం చూసేందుకు ఎగబడ్డారు. ఇంతలో నెమలి పక్కనే ఉన్న ఇండియన్‌బ్యాంకు ఏటీఎం కేంద్రంలోకి వెళ్లింది. అక్కడి నుంచి పక్కనే ఉన్న వేపచెట్టుపైకి వెళ్లి తర్వాత అడవిబాట పట్టింది.

ట్రావెల్స్ బస్సుకు తప్పిన ప్రమాదం

ఒంటిమిట్ట : మండలంలోని పోలిబుచ్చయ్యగారిపల్లి వీరాంజనేయస్వామి ఆలయం సమీపా న ఇరుకుబోటు వద్ద సోమవారం అర్ధరాత్రి 12:45 గంటలకు ఓ ట్రావెల్స్ బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మంగళవారం పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి నుంచి హైదరాబాద్ వైపు జగన్ ట్రావెల్స్ బస్సు వెళ్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జాతీయ రహదారిపై బురద ఏర్పడటంతో.. బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న కంపచెట్లలోకి దూసుకుపోయింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా చేశారు. అనంతరం ట్రావెల్స్ యజమానులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదం జరిగిన బస్సులోని ప్రయాణికులను మరో బస్సులో హైదరాబాద్‌కు తరలించారు.

జోరుగా ఈ- పంట నమోదు

- జియో ఫెన్సింగ్ విధానం అమలు
- జిల్లా వ్యాప్తంగా 1,57,037 ఎకరాల్లో సాగు
- ఇప్పటికి 1,16,615 ఎకరాల్లో నమోదు పూర్తి



పెద్దతిప్పసముద్రం మండలంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

పెద్దతిప్పసముద్రం : కర్షకులకు కొండంత అండగా ఉండేందుకు ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలకు నాంది పలికింది. విత్తు నుంచి మొదలు విత్తనం వరకు అవసరమైన అన్ని రకాలుగా ఆసరాగా నిలుస్తోంది. పంట నష్ట పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా తదితర సౌకర్యాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొందేందుకు ఈ-క్రాప్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి ఎవరు ఏ పంట సాగు చేసారన్న వియయంపై సమగ్రంగా నమోదు చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలైన పండ్లు, కూరగాయల తోటలు ఇలా ప్రతి ఒక పంట నమోదు చేస్తున్నారు. రైతులు సాగు చేసిన పొలంలోకి వ్యవసాయ సిబ్బంది స్వయంగా వెళ్లి పంట ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. గతంలో మాదిరి కాకుండా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జియో ఫెన్సింగ్ ఎంపిక చేసుకున్న నంబర్లలో ఫొటో తీస్తున్నారు. ఈ ఏడాది పంటకు ఎలాంటి ఎడిట్ (సవరణ) ఆప్షన్ లేదు. ఫలితంగా పంటల నమోదులో అన్ని జాగ్రతలు తీసుకుంటున్నారు. అంతేగాక ఈ-క్రాప్ విధానం పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

తనిఖీలు ముమ్మరం

పంటల నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు జిల్లా ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు తనిఖీల్లో పాల్గొంటారు. ఆర్ఐ 10 శాతం రికార్డులు, వంద శాతం ప్రభుత్వ భూముల వివరాలు, డిప్యూటీ తహసీల్దార్ 5 శాతం రికార్డులు 25 శాతం ప్రభుత్వ భూములు, తహసీల్దార్ 1 శాతం రికార్డులు, 10 శాతం ప్రభుత్వ భూములు, ఏవో, ఉద్యాన శాఖ, సిరికల్చర్ అధికారి 10 శాతం, ఏడీలు 5 శాతం, జిల్లా వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారి 3 శాతం, జేసీ 2 శాతం, జిల్లా కలెక్టర్ 1 శాతం రికార్డులను తనిఖీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

జిల్లా వ్యాప్తంగా 1,57,037 ఎకరాల్లో పంటల సాగు

అన్నమయ్య జిల్లాలోని 30 మండలాల్లో 1,57,037 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఇందులో ఈ నెల 5వ తేదీ నాటికి 1,16,615 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో వేరుశనగ పంట సాగు గణనీయంగా తగ్గిపోయింది. దీంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా రైతులకు రాయితీపై ఉలవలు పంపిణీ చేసేందుకు సమాయత్తం అయ్యారు.

ప్రయోజనాలు

ఈ క్రాప్ నమోదైతే బ్యాంకుల ద్వారా సులువుగా పంట రుణం పొందవచ్చు. వైఎస్సార్ సున్నా వడ్డీకి అర్హత సాధించేందుకు వీలుంటుంది. ఎలాంటి ప్రీమియం చెల్లించకుండా ఉచిత పంటల బీమా పొందవచ్చు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన పంటకు పరిహారం పొందవచ్చు. ధరల పతన సమయంలో కనీస మద్దతు ధరతో వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించుకునే అవకాశం ఉంటుంది. పంట నమోదు కాకుంటే ప్రభుత్వం ద్వారా అందే రాయితీలు, పరిహారాలు, లబ్ధి కోల్పోతారని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

కూలిన మూడిళ్ల పైకప్పు



ఇంటి పైకప్పు కూలిన దృశ్యం

కొండాపురం : మండలంలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు సోమవారం రాత్రి మూడు ఇళ్ల పైకప్పు కూలిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. కొట్టాలపల్లెలో ఆర్.నరసమ్మ, కె.సావిత్రికి చెందిన ఇళ్ల పైకప్పులు కూలాయి. కె.సావిత్రి ఇంట్లో బియ్యం ప్యాకెట్లు, నిత్యావసర వస్తువులు తదితర ఆస్తి నష్టం వాటిల్లింది. ఉప్పితికాయలపల్లెలో ఓ ఇంటి పైకప్పు కూలింది. కూలినప్పుడు ఈ మూడిళ్లలోనూ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. అధికారులు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్ట పరిహారం వచ్చేలా చూడాలని బాధితులు కోరారు.

విద్యుత్ షాక్‌తో..

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలో మంగళవారం విద్యుత్ షాక్‌తో మోగసాల పెద్దక్క (57) మృతి చెందింది. రోటరీపురానికి చెందిన ఆమె ముద్దనూరు రోడ్డులోని చిన్న బంక్‌లో గాజులు, రిబ్బన్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తుండేది. బంక్‌కు వర్షం కారణంగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై మృతి చెందింది.

స్టాఫ్‌నర్స్‌ను వేధించిన డాక్టర్‌పై కేసు నమోదు

నిమ్మనపల్లె : ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న స్టాఫ్ నర్స్‌పై వేధింపులకు పాల్పడిన ఓ దంతవైద్యునితో పాటు ఆయన భార్యపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నిమ్మనపల్లె ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలోని స్టాఫ్‌నర్స్ రెడ్డెమ్మ గత కోవిడ్ సీజన్‌లో తిరుపతి రుయా ఆస్పత్రిలో పని చేస్తుండేది. ఆ సమయంలో తిరుపతికి చెందిన దంతవైద్యుడు షేక్ మహమ్మద్ సుభానితో పరిచయమైంది. ఒకే చోట పని చేస్తుండటంతో ఆమె ఫోన్ నంబర్ తీసుకుని తరచూ మాట్లాడుతుండేవాడు. తర్వాత కొంతకాలానికి ఆమె ఒంటరి మహిళని తెలుసుకుని లోబర్చుకునేందుకు ప్రయత్నిస్తూ... ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడటం, మెసేజీలు చేస్తుండేవాడు. బాధితురాలు రెడ్డెమ్మ అతని ఫోన్ నంబర్‌ను తన ఫోన్‌లో బ్లాక్ చేసింది. దీంతో షేక్ మహమ్మద్ సుభాని రెడ్డెమ్మ పని చేస్తున్న ప్రాంతం, తదితర వివరాలు కనుక్కుని ఇతరుల ఫోన్ నంబర్‌తో ఆమెకు మెసేజ్ చేయడం, ఆడియో, వీడియో రికార్డింగ్‌లు పంపడం చేస్తుండేవాడు. అంతేకాకుండా తన భార్య ఫాజియా ద్వారా ఆమెను బెదిరించాడు. ఈ క్రమంలో గతనెల ఆగస్టు 30న రెడ్డెమ్మ నిమ్మనపల్లె ప్రభుత్వ వైద్యశాలలో విధుల్లో ఉండగా, షేక్ మహమ్మద్ సుభాని, అతడి భార్య ఫాజియా ఇద్దరు కలిసి ఆస్పత్రికి వచ్చారు. బాధితురాలిని కులంపేరుతో దూషిస్తూ, రూ.10 లక్షలు ఇవ్వకపోతే అంతు చూస్తామంటూ బెదిరించారు. మానసికంగా వేధించారు. దీంతో వారి వేధింపులపై బాధితురాలు రెడ్డెమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితులు దంత వైద్యుడు షేక్ మహమ్మద్ సుభాని, అతని భార్య ఫాజియాలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కార్యాలయ సమావేశంలో శాశ్వత లోక్‌అదాలత్ పై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న ఈ వ్యవస్థ హైకోర్టు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ చట్టానికి లోబడి రాష్ట్ర ప్రభుత్వంచే ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పర్మనెంట్ లోక్‌అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. 10 రకాలైన ప్రజా ప్రయోజిత సేవా రంగాలకు సంబంధించిన సేవలలో ఎలాంటి అవాంతరాలు, లోపాల వల్ల జరిగే నష్టాలకు సంబంధించి పరిష్కారం పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా కోర్టు ఆవరణలోని పర్మనెంట్ లోక్‌అదాలత్ కార్యాలయంలో సంప్రదించవచ్చని, లేదా 8639684279, 9963731698లకు కాల్ చేసి చట్టముపై అవగాహన పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ వైఎస్సార్, అన్నమయ్య జిల్లా రీజినల్ మేనేజర్లు గోపాల్‌రెడ్డి, రాము, పర్మనెంట్ లోక్‌అదాలత్ మెంబర్లు ఎం.వి.సుబ్బారెడ్డి, ఎం.ఆదినారాయణ, పీఓ రవి, అధికారులు రోజా, అల్లాబకాష్, కడప డిపో మేనేజరు ఢిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో మదనపల్లె వాసి మృతి

- పోలీసులు కొట్టి చంపేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ
- కిడ్నీ వ్యాధితో మృతి చెందాడన్న కర్ణాటక పోలీసులు



మునిరాజ (ఫైల్)

మదనపల్లె : మండలంలోని మాలేపాడు పంచాయతీ ఆవులపల్లె సమీపంలోని నల్లరాజుగానిపల్లెకు చెందిన ఎరుకుల మునిరాజ కర్ణాటకలోని కోలార్ ఆర్.ఎల్.జాలప్ప మెడికల్ కళాశాలలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నల్లరాజుగారిపల్లెకు చెందిన శ్రీరాములు కుమారుడు మునిరాజా(27)ను కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా ముళబాగల్ నియోజకవర్గం నంగిలికి చెందిన పోలీసులు పది రోజుల క్రితం ద్విచక్రవాహనాల చోరీకి సంబంధించి విచారణ నిమిత్తం తీసుకెళ్లారు. మునిరాజతోపాటు మరో ఇద్దరిని ఇదే కేసులో విచారణకు తీసుకెళ్లినట్లు తెలిసింది. కర్ణాటక పోలీసులు ఆగస్టు 21న మునిరాజాను ఇంటి నుంచి తీసుకెళ్లారని, అప్పటి నుంచి వారి వద్దే ఉంచుకున్నారని, విచారణలో భాగంగా పోలీసులే తన బిడ్డను తీవ్రంగా కొట్టి చంపేశారని తల్లి మునిలక్ష్మమ్మ ఆరోపించింది. పోలీసులు తన బిడ్డను చంపేసిన విషయమై గల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపింది. అయితే కర్ణాటక పోలీసుల కథనం మరోలా ఉంది. మునిరాజా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటంతో సమీప బంధువైన గంగాధర్‌కు మునిరాజాను అప్పగించి వైద్యసేవల కోసం కోలార్ ఆర్.ఎల్.జాలప్ప మెడికల్ కాలేజీకి పంపామని, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెబుతున్నారు. మునిరాజ మృతదేహంపై గాయాలు స్పష్టంగా కనిపిస్తుండటం, పోలీసుల దెబ్బలకు తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడా..? పోలీసులు కొట్టడంతో మృతి చెందాడా అని బంధుమిత్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్రవాహనాల చోరీ కేసులో మునిరాజతోపాటు పోలీసులు తీసుకెళ్లిన మరో ఇద్దరు ఇప్పటికీ కర్ణాటక పోలీసుల కస్టడీలోనే ఉన్నారు. వారిచ్చే సమాచారం లేదా.. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా మునిరాజ మృతిపై సందిగ్ధం వీడనుంది. దీనికి సంబంధించి మదనపల్లె తాలూకా పోలీసులను వివరణ కోరితే.. తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఢీకొన్న కార్లు.. ఇద్దరికి తీవ్ర గాయాలు



ఢీకొన్న కార్ల ప్రమాద దృశ్యం

బి.కొత్తకోట : మదనపల్లె నుంచి పెద్దతిప్పసముద్రం వెళ్తున్న టీచర్ల కారును బి.కొత్తకోట నుంచి మదనపల్లె వెళ్తున్న కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రంగా, మరొకరికి స్వల్పంగా గాయాలయ్యాయి. బి.కొత్తకోట వద్ద మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దతిప్పసముద్రంలో పని చేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులు కారులో మదనపల్లె నుంచి బయలుదేరారు. వీరు బి.కొత్తకోట సమీపంలోని కొత్తపల్లె క్రాస్ వద్దకు రాగానే బి.కొత్తకోట నుంచి మదనపల్లెకు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో ప్యారేజాన్ (45), మస్తానీ (51) తీవ్రంగా గాయపడ్డారు. నిజాముద్దీన్ (42) స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను స్థానిక సీహెచ్‌సీకి తరలించి చికిత్సలు చేయించారు. మెరుగైన వైద్యం కోసం108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామమోహన్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..



మృతి చెందిన రామ్ పుల్లయ్య

ఓబులవారిపల్లె : మండలంలోని మంగంపేట జాతీయ రహదారిపై మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రామ్‌పుల్లయ్య (48) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగంపేట గ్రామంలోని మంగంపేట కంకర క్వారీ వద్ద కూలీ పనులు చేసుకునే రామ్ పుల్లయ్య, ఆయన భార్య నాగరాణి మంగళవారం ఉదయం పనులు ముగించుకొని మంగంపేటలోని తమ ఇంటికి జాతీయ రహదారిపై కాలినడకన వెళ్తున్నారు. మంగంపేట డౌన్ వద్ద గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి వారిని ఢీకొంది. దీంతో రామ్ పుల్లయ్యకు తీవ్ర, నాగరాణికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామ్ పుల్లయ్య మృతి చెందాడు. నంద్యాల జిల్లా బేతంచెర్ల గ్రామానికి చెందిన రామ్ పుల్లయ్య పదేళ్లుగా మంగంపేటలో నివాసం ఉంటూ క్రస్సర్‌లో పని చేస్తున్నాడు. మృతుడికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి

- కులాంతర వివాహమే కారణమా ?
- భర్తే చంపేసాడని కన్నవాళ్ల ఆరోపణ
- పెళ్లయి ఆరు నెలలు గడవకనే పరలోకాలకు



శ్రీవిద్య, విజయ్‌కుమార్‌రెడ్డి పెళ్లి ఫొటో (ఫైల్)



మృతి చెందిన శ్రీవిద్య

పెద్దతిప్పసముద్రం : ప్రేమించి పెళ్లి చేసుకుని భర్తే సర్వం అని ఆ యువతి అతని వెంట నడచింది. వివాహం జరిగి ఆరు నెలలు కూడా తిరక్కుండానే అనంత లోకాలకు వెళ్లిపోయింది. దీంతో ఆమె కన్నవాళ్లు, బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు. రెండు రోజుల క్రితం కర్ణాటకలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతురాలి కుటుంబీకుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దతిప్పసముద్రం మండలంలోని మల్లెల దళితవాడకు చెందిన నరసింహులు, ఉషారాణి దంపతుల కుమార్తె శ్రీవిద్య (22) మదనపల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. చదువుకుంటున్న సమయంలోనే అదే కళాశాలలో చదువుతూ మదనపల్లిలోని నీరుగట్టివారిపల్లిలో కాపురం ఉండే మల్లీశ్వరి, మారపరెడ్డి దంపతుల కుమారుడు విజయ్ కుమార్‌రెడ్డి (23)లు ప్రేమించుకున్నారు. కులాంతర వివాహం అని వద్దు అని యువకుడి కుటుంబీకులు అడ్డు చెప్పారు. దీంతో వీరిద్దరూ ఈ ఏడాది మార్చి నెలలో మదనపల్లిలోని ఓ ఆలయంలో దండలు మార్చుకుని అనంతరం అక్కడే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని మునిరెడ్డిపాళ్యంలో కాపురం పెట్టారు. యువతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటుండగా యువకుడు ఉద్యోగ అన్వేషణలో ఉంటూ మద్యం, క్రికెట్ బెట్టింగ్‌లకు బానిస అయ్యాడు. గత రెండు నెలల నుంచి పుట్టింటి నుంచి నగదు, నగలు తేవాలని యువతిపై ఒత్తిడి తెచ్చాడు. దిక్కుతోచని ఆమె కన్నవాళ్ల ద్వారా నగలు, డబ్బులు తెప్పించుకుంది. జల్సాలకు బానిసైన యువకుడు ఉన్న డబ్బంతా ఖర్చు చేయడమే గాక తాళిబొట్టు కాసులు కూడా అమ్మేశాడు. ఈ నేపథ్యంలో గత నెల రోజుల క్రితం అతడికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. దీంతో అయ్యిందేదో అయింది ఆ అమ్మాయిని ఏదో విధంగా వదిలించుకో.. నీకు మరో పెళ్లి చేస్తామని యువకుడి కన్నవాళ్లు భరోసా ఇవ్వడంతో ఆమెను మరింత ఒత్తిడికి గురి చేశాడు. ఈ తరుణంలో రెండు రోజుల క్రితం దంపతులిద్దరూ తీవ్రంగా గొడవ పడ్డారు. అనంతరం ఏం జరిగిందో ఏమో శ్రీవిద్య ఇంట్లోనే మంచంపై అపస్మారక స్థితిలో పడి ఉండగా.. పక్కనే విజయ్‌కుమార్‌రెడ్డి ఏడుస్తూ కూర్చుని అరగంట అనంతరం సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి యువతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తుండగా.. విజయ్‌కుమార్‌రెడ్డి ఆసుపత్రి నుంచి పరారీ అయ్యాడు. అనంతరం మృతదేహాన్ని సోమవారం యువతి స్వగ్రామమైన మల్లెల గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. తమ బిడ్డను కట్టుకున్న వాడే కడ తేర్చాడని కన్నవాళ్లు ఆరోపిస్తున్నారు. హత్యా, ఆత్మహత్యా అనేది అక్కడి పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

'హలో.. మాస్టారూ'..అక్కడొద్దు!

- ఇకపై పాఠశాలల్లో సెల్‌ఫోన్లు 'నో'
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ
- డీఈవో, డీవైఈఓ, ఎంఈవోలకు పర్యవేక్షణ బాధ్యతలు

జిల్లాలో మొత్తం పాఠశాలలు	2213
విద్యార్థులు	1,54,789



మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల

మదనపల్లె సిటీ : దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతోంది. భావిభారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేదే. గురువులే క్రమశిక్షణ పాటించకపోతే విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుంది. స్మార్ట్‌ఫోన్ల రాకతో చాలా మంది ప్రభుత్వ ఉపాధ్యాయుల పనితీరుపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. తరగతి గదుల్లో టీచర్లు సెల్‌ఫోన్‌ల వినియోగంపై ఉన్నతాధికారులకు నిత్యం ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో అలాంటి పరిస్థితులను చక్కదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు పాఠశాలల్లో మొబైల్‌ఫోన్లను నిషేదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాలని ఆర్జేడీ, డీఈవో, డైట్ కళాశాల ప్రిన్సిపల్స్‌ను ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

బోధనకు ఆటంకం కలగకుండా...

జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో బోధన సమయంలో ఎటువంటి ఆటంకం రాకుండా, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పూర్తి ఏకాగ్రత పాఠ్యంశాల మీదనే ఉంచాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో మొబైల్ నిషేదం నిర్ణయం తీసుకున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు వృత్తిపరమైన అవసరాలకు కాకుండా వ్యక్తిగత అవసరాల కోసం మొబైల్‌ఫోన్లు ఉపయోగిస్తూ బోధనా సమయాన్ని వృధా చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇదే అదునుగా భావించి విద్యార్థులు సైతం స్మార్ట్ ఫోన్లను పాఠశాలకు తీసుకురావడం మొదలుపెట్టారు. తరగతి గదిలోనే ఫోన్లలో మాట్లాడడం, ముచ్చట్లు పెట్టడం, అల్లరి చేయడంతో క్రమశిక్షణ తప్పింది. దీంతో పాఠశాలల్లో మొబైల్ ఫోన్ నిషేదం విధించినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

హెచ్‌ఎం అనుమతితో...

బయోమెట్రిక్ వేసిన వెంటనే హెచ్‌ఎం గదిలో, క్లర్క్ వద్ద మొబైల్ డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అత్యవసరం అయితే హెచ్‌ఎం అనుమతి తీసుకుని ఉపయోగించాలి. తరగతి గదుల్లో విద్యాబోధన కోసం ప్రభుత్వం ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌లు, స్మార్ట్ టీవీలు, ట్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఉపాధ్యాయులు ఉదయం తొమ్మిదన్నరకు ముందు సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే మొబైల్స్ వినియోగించాలి. ఒకవేళ అటెండెన్స్ తీసుకోవడం ఆలస్యం అయితే సంబంధిత హెచ్‌ఎం అనుమతితో సెల్‌ఫోన్ ఉపయోగించాలి. మొదటిసారి నిబంధనలు ఉల్లంఘిస్తే హెచ్‌ఎంలకు రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలి. రెండోసారి మండల విద్యాశాఖాధికారితో మాట్లాడిన తర్వాత మాత్రమే సెల్‌ఫోన్ ఉపయోగించాలి. మూడోసారి అయితే ఉపాధ్యాయుడి సెల్‌ఫోన్‌ను డీఈవోకు సరెండర్ చేయాల్సి ఉంటుంది. డీఈవోతో చర్చించిన తర్వాత మాత్రమే సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేసి సెల్‌ఫోన్ తీసుకోవాల్సి ఉంటుంది.


పకడ్బందీగా అమలుకు చర్యలు



ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. పాఠశాలల్లో సెల్‌ఫోన్‌ల నిషేదంపై జారీ చేసిన ఉత్వర్వులను అన్ని మండలాల ఎంఈఓలకు, డీవైఈవోలకు పంపించాం. ఉపాధ్యాయులు తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడితే చర్యలు చేపడుతాం. విద్యార్థులతో పాటు టీచర్లు సెల్‌ఫోన్ తరగతి గదుల్లో వినియోగించరాదు.

– శ్రీరాం పురుషోత్తం, డీఈఓ, రాయచోటి.

ఉత్తర్వులు అమలుకు సన్నాహాలు



పాఠశాలల్లో సెల్‌ఫోన్‌లను నిషేదిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అందాయి. ఆ ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయనున్నాం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిది. పాఠశాలల తనిఖీల సమయంలో టీచర్లు సెల్‌ఫోన్‌లు వినియోగిస్తున్నట్లు కనిపిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో బోధన అభ్యసన ప్రక్రియ సజావుగా సాగుతుంది.

– క్రిష్ణప్ప, డీవైఈఓ, మదనపల్లె.